మాజీ సర్పంచ్ మృతి

వెంకటయ్య(ఫైల్)

ఐనవోలు, నవంబర్ 25 : ఐనవోలు మాజీ సర్పంచ్ కాటబోయిన వెంటకయ్య(85) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. వెంకటయ్య 1994 నుంచి 1999 వరకు ఐనవోలు సర్పంచ్‌గా, పర్సన్ ఇన్‌చార్జిగా 1999-2001 వరకు సేవలందించాడు. ఐనవోలు నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణం, అంగడికి స్థలం కొనుగోలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ మునిగాల సంపత్‌కుమార్, మాజీ సర్పంచ్ జన్ను కుమారస్వామి ఉన్నారు.

వాహనం ఢీకొని యువకుడికి గాయాలు

ఆత్మకూరు, నవంబర్ 25 : మండల కేంద్రానికి చెందిన కుక్కల వేణు(28)ను గుర్తు తెలియని వాహనం ఆదివారం రాత్రి ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలైనట్లు ఎస్సై పరమేశ్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఇప్పు రాజు అంత్యక్రియల్లో పాల్గొని ఇంటికి కాలినడకన వస్తుండగా, వేణును ములుగు నుంచి హనుమకొండకు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన వేణును కుటుంబ సభ్యులు, బంధువులు 108 వాహనంలో ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. వేణు తమ్ముడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహించాలి

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 25: ఎల్ఎల్‌బీ, ఏఎల్ఎం, డిగ్రీ, పీజీ కోర్సుల్లో అన్ని సబ్జెక్టులు పాసై, చివరి సెమిస్టర్‌లో ఒక సబ్జెక్టు ఫెయిలైన విద్యార్థులందరికీ ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారావు డిమాండ్ చేశారు. సోమవారం కేయూ ఎదుట ధర్నా నిర్వహించి రిజిస్ట్రార్ మల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నాయిక్క క్లయింట్ అయిన గుగులోతు రామస్వామి, తండ్రి:లాలు, నివాసము: ఇంటి నెం. 5-ఎ/1, భానాపూర్ రోడ్, నర్సంపేట్, వరంగల్ జిల్లా గారు, రామా చంద్రమోహన్, S/o. లేట్ శంకర్‌లింగం, రామా స్వరూప, భర్త: లేట్ జగన్‌మోహన్, రామా పృథ్వి, S/o. లేట్ జగన్‌మోహన్, రామా స్వప్న, భర్త: లేట్ రాధాకృష్ణ, వైద్యం అన్నపూర్ణ, భర్త: భాస్కర్, అడ్డగట్ల అపర్ణ, భర్త: వెంకటేశ్వర్లు, రామా ప్రియాంక, తండ్రి: లేట్ జగన్‌మోహన్, రామా జ్యోస్న, తండ్రి: లేట్ జగన్‌మోహన్ గార్లపై నర్సంపేట గ్రామ శివారులోని సర్వే నెం. 111/1/91 మరియు 111/1/92 లో గల ఎ. 3-30 గుంటల భూమిపై తనకు చేసిన సేల్ అగ్రిమెంట్‌ను అమలుపర్చవలసిందిగా కోరుతూ గౌరవ వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టు నందు ఓ.యస్. నెం. 38/2024 కేసును ఫైలు చేయడం జరిగింది. ఇట్టికేసులో గౌరవ వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టు గారు ఐ.ఎ.నెం. 1063/2024లో యధాతథ స్థితి కొనసాగించవలసిందిగా ఉత్తర్వులు జారీ చేయనైనది. కావున ఇట్టిస్థలముపై ఇతరులెవ్వరు ఎటువంటి క్రయ ఒప్పందాలు గాని మరియు తనఖాలు గాని చేసుకోకూడదని తెలియపర్చనైనది. ఇట్టి ఉత్తర్వులు ఉన్నందున వేరే ఎవ్వరైనా క్రయ ఒప్పందాలు గాని మరియు తనఖాలు గాని చేసుకున్నచో అట్టి ఒప్పందములు చెల్లనేరవని ఇందుమూలముగా తెలియజేయనైనది. ఇట్టి ఇస్తి విషయంలో ఎవరైనా ఎలాంటి లావాదేవీలు జరిపినచో అట్టి వారు నా క్లయింటు తీసుకోబోయే సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు పూర్తి బాధ్యులు కాగలరు.
తేది: 26-11-2024
సం/- సి.విద్యాసాగర్‌రెడ్డి,
ఇంటి నెం.1-7-427/1, రెవెన్యూ కాలనీ,
హనుమకొండ సెల్ : 9849169060

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I **Shobha Rani E** W/o **Thotte Ravi** Resident of Balaji Nagar H.No- 25-11-286/2, Kazipet declare that I changed my name from **Shobha Rani E** to **Thotte Rani.**
NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

సమస్యలు పరిష్కరించండి

- గ్రీవెన్స్‌లో మొరపెట్టుకున్న ప్రజలు
- వివిధ సమస్యలపై 156 అర్జీలు
- విజ్ఞప్తులు స్వీకరించిన కలెక్టర్ ప్రావీణ్య


ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హనుమకొండ, నవంబర్ 25 : సమస్యలతో వచ్చాం.. పరిష్కరించాలని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో మొరపెట్టుకున్నారు. రెండు వారాలుగా గ్రీవెన్స్ నిర్వహించకపోవడంతో పెద్దఎత్తున బాధితులు కలెక్టరేట్‌లో బారులు తీరారు. కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్వో వైవీ గణేశ్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 156 అర్జీలు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. జడ్పీ సీఈవో విద్యాలత, డీఆర్డీవో మేన శ్రీను పాల్గొన్నారు.

దారి పునరుద్ధరించాలని వినతి..

మడికొండలోని మోడల్ ఇందిరమ్మ కాలనీలో 2 సంవత్సరాల నుంచి ఉన్న రోడ్డును మాజీ కార్పొరేటర్ తొట్ల రాజు ఆక్రమించుకున్నాడని మాడల్ ఇందిరమ్మ కాలనీకి చెందిన మహిళలు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. సుమారు 2,700 కుటుంబాలు నివసించే ఈ కాలనీకి రొట్టెబండ నుంచి వేసిన బీటీ రోడ్డు ద్వారా రాకపోకలు జరుగుతున్నాయన్నారు. మాజీ కార్పొరేటర్ ఈ నెల 9న రోడ్డును ధ్వంసం చేశాడని, రోడ్డును పునరుద్ధరించి రాంపూర్ రైల్వే గేట్ నుంచి ఉన్న 30ఫీట్ల మట్టి రోడ్డును బీటీగా మార్చాలని కోరారు.

కరదీపిక ఆవిష్కరణ..

ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమంపై రూపొందించిన కరదీపికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కరదీపిక వైద్యాధికారులకు చాలా ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఆర్డీవోలు రమేశ్ రాథోడ్, నారాయణ, డీఈవో వాసంతి, జిల్లా సంక్షేమ అధికారి జయంతి పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి..

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బీసీ, ఎస్సీ, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో మధ్యాహ్న భోజనం, ఫుడ్ సేఫ్టీపై అధికారులు, ఆహార పదార్థాల సరఫరాదారులతో సమావేశం నిర్వహించారు. ఆహార పదార్థాలు, కూరగాయలు నాణ్యతగా లేకుంటే తిరిగి పంపించాలని ఆదేశించారు. జిల్లాలోని గురుకుల విద్యాసంస్థలు, హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించిన అధికారులు పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో సీపీవో సత్యనారాయణరెడ్డి, డీపీవో లక్ష్మీ రమాకాంత్, డీసీఎస్‌వో కొమరయ్య, పౌర సరఫరాల శాఖ మేనేజర్ మహేందర్, ఆర్ అండ్‌బీ ఈఈ సురేశ్‌బాబు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం ఇవ్వాలి..

ఏండ్లు గడుస్తున్నా కడిపికొండ రైల్వే బ్రిడ్జి రోడ్డులో భూమి కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వడం లేదని వెంటనే ఇప్పించాలని కడిపికొండ గ్రామ రైతులు కలెక్టర్‌కు మొర పెట్టుకున్నారు. 20ఏళ్ల నుంచి భూమి కోల్పోయిన రైతులు ప్రభుత్వానికి పలుమార్లు అర్జీలు పెట్టుకుంటున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని రైతులు వినతిపత్రం అందజేశారు.

కలెక్టర్‌ను కలిసిన టీజీవో కార్యవర్గం..

టీజీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో జిల్లా నూతన కార్యవర్గం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మురళీధర్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, అన్వర్‌హుస్సేన్, శ్రీనివాస్‌రెడ్డి, పెద్ది ఆంజనేయులు, చంద్రశేఖర్, రఘుపతిరెడ్డి, మహేశ్‌కుమార్, మాధవరెడ్డి, సంతోష్, రవిప్రసాద్, శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మి, నాగరాజు, శివాజీ, విక్రమ్, వినోద్‌కుమార్, రమేశ్‌కుమార్, వినయ్, కృష్ణవేణి ఉన్నారు.

నా పేరుపై పట్టా మార్చాలి..

- మాదిరెడ్డి తిరుపతిరెడ్డి, శాయంపేట

నా పేరుపై ఉన్న 0.39గుంటల భూమిని నా పెద్ద కుమారుడు వెంకట్ రెడ్డి పేరుపై పట్టా చేసుకున్నాడు. దాన్ని రద్దు చేసి నా పేరుపై పట్టా చేయాలి. వెంకట్‌రెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో నాకు వృద్ధాప్య పింఛన్ రావడం లేదు. పైగా, వెంకట్‌రెడ్డి నాకు, మిగతా ముగ్గురు కుమారులకు తెలియకుండా సర్వే నంబర్ 10/1లోని 39గుంటల భూమిని తన పేరుపై పట్టా చేసుకొన్నాడు. ఐదు సంవత్సరాలుగా నన్ను, నా భార్యను పెద్ద కుమారుడు పట్టించుకోలేదు. నా భార్యకు గుండెపోటు వచ్చినా రాలేదు. మా ఇద్దరి బాధ్యతలు రెండో కుమారుడు రాంరెడ్డి, నాలుగో కుమారుడు జితేందర్ రెడ్డి చూస్తున్నారు. సంవత్సరం క్రితం నా భార్య చనిపోయినా రాలేదు. కానీ భూమిని మాత్రం పట్టా చేసుకొన్నాడు. నన్ను చూడని నా పెద్దకుమారుడి పేరుపై ఉన్న పట్టా భూమిని నా పేరుపై మార్చి న్యాయం చేయాలి.

వృద్ధురాలిని.. న్యాయం చేయండి..

- రేకుల కౌసల్య, కొప్పూర్, భీమదేవరపల్లి

నాకు నలుగురు కుమారులు. నా పేరుపై 1.33 ఎకరాల భూమి ఉంటే మూడో కుమారుడు ప్రభాకర్‌రెడ్డి తన పేరుపై చేసుకొని నన్ను చూడడం లేదు. పెద్ద కుమారుడు ప్రతాప్‌రెడ్డి, చిన్న కుమారుడు గోపాల్‌రెడ్డి నా బాగోగులు చూస్తున్నారు. నన్ను చూడకపోవడమే కాకుండా నా భూమిని అక్రమంగా పట్టా చేసుకొన్నాడు. ఆ భూమిని నా పేరుపై చేసి న్యాయం చేయాలి.

ఆసరా పింఛన్ మంజూరు చేయాలి..

- సకినాల లింగయ్య, పెగడపల్లి, హసన్‌పర్తి మండలం

నేను క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాను. ఇంతకుముందు కిడ్నీ వ్యాధితో అనేక ఆస్పత్రులు తిరిగి ఆర్థికంగా నష్టపోయాను. వ్యాధి నయం కాకపోవడంతో ఒక కిడ్నీ తీసివేశారు. ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. కనీసం ఆసరా పింఛన్ ఇప్పించి నా నెలవారీ మందులు, ఇతర ఖర్చులకు ఉపయోగపడుతాయి.

ప్రజా సమస్యల పరిష్కారంపై శ్రద్ధ పెట్టాలి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, నవంబర్ 25 : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు శ్రద్ధ పెట్టాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కమిషనర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కాశీబుగ్గ మాధురి నగర్ రోడ్ నంబర్-3లో రోడ్డు, డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నామని, పరిష్కరించాలని స్థానికులు కోరారు. కీర్తి నగర్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని కాలనీ వాసులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. 42వ డివిజన్ తెలంగాణ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే నిర్మించాలని స్థానికులు కమిషనర్‌ను కోరారు. 4వ డివిజన్ జ్యోతిబసు నగర్ గుడిసె కాలనీలో కనీస వసతులు కల్పించాలని వినతిపత్రం అందజేశారు. గ్రీవెన్స్‌లో 88 వినతులు వచ్చాయి. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 42, ఇంజినీరింగ్ విభాగం 21, ప్రజారోగ్య విభాగం 12, పన్నుల విభాగం 9, తాగునీటి సరఫరా 3, హార్టికల్చర్ 2 వినతులు వచ్చాయి. గ్రీవెన్స్‌లో ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో రాజిరెడ్డి, ఎంహెచ్‌వో రాజేశ్, ఇన్‌చార్జి సిటీప్లానర్ రవీంద్ర రాడేకర్, డీఎఫ్‌వో శంకరలింగం, కార్యదర్శి అలివేలు, బయాలజిస్ట్ మాధవరెడ్డి, హెచ్‌వో రమేశ్, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, ట్యాక్సేషన్ అధికారి బిర్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

సుబేదారి, నవంబర్ 25 : చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. సోమవారం సుబేదారి పోలీసు స్టేషన్‌లో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌కు అల్వేర్ జిల్లా ఖేర్గికి చెందిన రోహిత్‌కుమార్ శర్మ, మరో బాలుడు బైక్‌పై వచ్చి సెప్టెంబర్ 11న అదాలత్ నుంచి ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలో నుంచి పుస్తెల తాడు లాక్కెళ్లారు. కేయూసీ, మట్టెవాడ, స్టేషన్ ఘన్‌పూర్‌లో చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. సోమవారం అదాలత్‌లో పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తున్న క్రమంలో నిందితులు పట్టుబడ్డారు. వీరి నుంచి 10 గ్రాముల గోల్డ్, రూ.80వేల నగదు, బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కాజీపేటలో అద్దె ఇంట్లో ఉంటూ చోరీలకు పాల్పడుతున్నట్లు ఏసీపీ తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట, నవంబర్ 25 : అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాజీపేట రైల్వే జంక్షన్ శివారులో సోమవారం జరిగింది. కాజీపేట జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కడిపికొండకు చెందిన మహ్మద్ రఫీ (56)కి పక్షవాతం రావడంతో జీవితంపై విరక్తి చెంది అయోధ్యపురం రైల్వే గేట్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.

చెత్త తరలింపు ప్రక్రియ నిత్యం జరగాలి

మేయర్ గుండు సుధారాణి

వరంగల్, నవంబర్ 25 : ప్రతి రోజు ఇంటింటా సేకరించిన చెత్తను సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నుంచి విధిగా డంపింగ్ యార్డుకు తరలించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె పోతన నగర్‌లోని సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్పొరేషన్ పరిధిలో 84,432 ఈఈఎస్ఎల్ వీధి దీపాలు ఉండగా, అందులో 5,052 లైట్లకు మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు. ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఎంహెచ్‌వో రాజేశ్, ఈఈ మహేందర్, డీఈ సారంగం, ఏఈ సంతోష్ పాల్గొన్నారు.

16వ ఆర్థిక సంఘం సమావేశానికి మేయర్..

ఢిల్లీలో జరిగే 16వ ఆర్థిక సంఘం సమావేశానికి మేయర్ గుండు సుధారాణి హాజరు కానున్నారు. 10 లక్షల కంటే తక్కువ జనాభా కలిగిన నగరాల కేటగిరీలో ఉన్న వరంగల్‌కు ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సమావేశంలో వివిధ పథకాల్లో నగరంలో అభివృద్ధి పనుల పురోగతిపై నివేదించనున్నారు.

ఫీజులు తగ్గించాలని విద్యార్థుల ధర్నా

హసన్‌పర్తి, నవంబర్ 25 : కండోనేషియన్ ఫీజులు తగ్గించాలని అనంతసాగర్ శివారులోని ఎస్సార్ యూనివర్సిటీ, జాతీయ రహదారిపై విద్యార్థులతో పాటు ఏబీవీపీ నాయకులు సోమవారం ధర్నా చేపట్టారు. గత సెమిస్టర్‌లో కన్ఫర్మేషన్ ఫీజు రూ.500 ఉంటే ఈ ఏడాది రూ.వెయ్యి వసూలు చేస్తున్నారని, 60 శాతం కన్నా తక్కువ హాజరు ఉంటే రూ.2వేలు కంటిన్యూషన్ ఫీజు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. కాగా పోలీసులు ఎస్సార్‌యూ చేరుకొని విద్యార్థులతో మాట్లాడి ధర్నా విరమింపజేశారు. కార్యక్రమంలో సంగం సుమిత్‌రెడ్డి, కార్యదర్శి అరుణ్, కన్వీనర్ రోహిత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

దేవాదాయ భూముల కబ్జాలపై లోకాయుక్తలో విచారణ

వరంగల్, నవంబర్ 25 : నగరంలోని పద్మాక్షి సిద్ధేశ్వర ఆలయం, రంగనాయక, పిచ్చమాంబ, వేణుగోపాలస్వామి ఆలయాల భూములపై రెండేళ్లుగా లోకాయుక్త కోర్టులో విచారణ సాగుతోంది. సోమవారం జరిగిన విచారణకు వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, కాకతీయ వారసత్వ సంపద పరిరక్షణ సమితి కన్వీనర్ చీకటి రాజు, పద్మాక్షి ఆలయ ఈవో ప్రసాద్ హాజరయ్యారు. 2,039 ఎకరాల భూమి కబ్జా అయిందని కోర్టులో చెప్పిన దేవాదాయ శాఖ అధికారులు కేసులు నమోదు చేయడంలో నిర్లక్ష్యం చేశారు. దీనిపై పలుమార్లు న్యాయమూర్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సిద్ధేశ్వర ఆలయానికి చెందిన 9 గుంటల భూమి కబ్జా చేసిన ఎస్ఆర్ కళాశాల యాజమాన్యంపై ట్రిబ్యునల్‌లో కేసు నమోదు చేసినట్లు న్యాయమూర్తి సీవీ రాములు ఎదుట ఆలయ ఈవో ప్రసాద్ తెలిపారు. తదుపరి విచారణను డిసెంబర్ 31కు వాయిదా వేశారు.

త్వరితగతిన వ్యవసాయ సర్వీసులు రిలీజ్ చేయాలి

హనుమకొండ, నవంబర్ 25 : వరి కోతలు ప్రారంభమైన దృష్ట్యా వ్యవసాయ సర్వీసులను యుద్ధ ప్రాతిపదికన రిలీజ్ చేయాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో 16 సర్కిళ్ల ఏడీఈ, ఏఈలతో సమావేశం నిర్వహించారు. 3నెలల కంటే పెండింగ్ ఎట్టి పరిస్థితిల్లో ఉండకూడదని ఆదేశించారు. మీ సేవ, టీజీ ఐపాస్ దరఖాస్తులను వెంటనే రిలీజ్ చేయాలన్నారు. గిరివికాసంలో దరఖాస్తుల చేసుకున్న వాటినీ పూర్తి చేయాలన్నారు. ఇన్‌చార్జి డైరెక్టర్లు సదర్‌లాల్, సీజీఎంలు కిషన్, అశోక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, నవంబర్ 25 : హనుమకొండ టౌన్ పరిధిలో పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ద్వారక సాయికాలనీ, నవయుగ కాలనీ, జవహర్ కాలనీ, మారుతినగర్, ఎస్వీఎస్ హోమ్స్, ఉషోదయ కాలనీ, ఎన్జీవోస్ కాలనీ, మోక్షా విలాస్, మిశాల్ మార్ట్, సాయినగర్ కాలనీ ఏరియాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

జిల్లాలో కేంద్ర అధికారుల పర్యటన

హనుమకొండ, నవంబర్ 25 : రాష్ట్రంలో అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించేందుకు కేంద్ర మానవాభివృద్ధి వనరుల సంస్థ అధికారులు జిల్లాలో పర్యటించారు. వీరు వచ్చే నెల 3వ తేదీ వరకు వివిధ గ్రామాల్లో పర్యటించనున్నారని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో కేంద్ర అధికారులు సమావేశమయ్యారు. ధర్మసాగర్, తాటికాయల, పెద్ద పెండ్యాల, ఆత్మకూరు, కామారం, పెంచికల్‌పేట గ్రామాలను సందర్శించనున్నారని వెంకట్‌రెడ్డి చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేశ్, జడ్పీ సీఈవో విద్యాలత, డీఆర్డీవో మేన శ్రీను పాల్గొన్నారు.

అధికారికంగా నిర్వహించాలి..

హనుమకొండ : 75 ఏళ్ల భారత రాజ్యాంగ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరుతూ డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి చుంచు నరేశ్, జిల్లా మహిళా నాయకురాలు బౌతు రాధ, ఆడెపు రమ, పెద్ద రమాదేవి పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల రీ షెడ్యూల్

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 25 : ఈ నెల 26, 27, 28 తేదీల్లో జరగాల్సిన కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను రీ షెడ్యూల్ చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి నరసింహాచారి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు డిసెంబర్ 27వ తేదీకి, జనరల్ ఇంగ్లిష్ పేపర్ డిసెంబర్ 30న, డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలు డిసెంబర్ 28కి, అదేవిధంగా డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలు డిసెంబర్ 27, 30న జరుగుతాయని, 29 నుంచి జరగాల్సిన మిగతా పరీక్షలు షెడ్యూల్ ప్రకారం యథావిధిగా జరుగుతాయని, వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ చూడాలని అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు తిరుమలాదేవి, వెంకటయ్య తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

శాయంపేట, నవంబర్ 25 : గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్ అన్నారు. శాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గంజాయి, మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఎంపీడీవో ఫణిచంద్ర, తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్సై ప్రమోద్, ఎక్సైజ్ ఎస్సై సులోచన, కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్, సమన్వయకర్త సునీల్ పాల్గొన్నారు.

ఎంపికైన కేయూ బ్యాడ్మింటన్ మహిళా టీం

సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పోటీలకు కేయూ టీం

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 25 : ఈ నెల 26 నుంచి 28 వరకు కర్ణాటక రాష్ట్రం బెళగావిలోని విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ (మహిళల) టోర్నమెంట్‌కు టీంను ఎంపిక చేసినట్లు స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి వెంకయ్య తెలిపారు. వీరిలో మంచిర్యాల ఎంఐఎంఎస్ డిగ్రీ కాలేజీ నుంచి అశ్విత, కేయూ ఇంజినీరింగ్ కాలేజీ (కో ఎడ్యుకేషన్) నుంచి ఎం పూజిత రాగప్రియ, వరంగల్ కిట్స్ కళాశాల నుంచి ఎస్ శ్రీనిత, పీ లక్ష్మి, కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ కాలేజీ నుంచి కే దీక్షిత ఉన్నారని, వీరికి కోచ్ కం మేనేజర్‌గా సింగరేణి మహిళా డిగ్రీ కాలేజీ, వ్యాయామ అధ్యాపకురాలు కే సావిత్రి వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కే ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి అభినందించారు.

సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు

ఆత్మకూరు, నవంబర్ 25 : సామాజిక, ఆర్థిక, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ కుల గణన సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం గూడెప్పాడ్‌లోని విట్స్ కళాశాలలో 44మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఎంపీవో విమల పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తిక పూజలు

హనుమకొండ చౌరస్తా/కాజీపేట, నవంబర్ 25 : చారిత్రక వేయిస్తంభాల ఆలయంలో రుద్రేశ్వరునికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. కార్తికమాసం చివరి సోమవారం కావడంతో భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. రుద్రేశ్వరుడిని స్మరిస్తూ 300 మంది శివ భక్తులు జలాభిషేకాలు నిర్వర్తించుకున్నట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. కాజీపేట రైల్వే దేవాలయ సముదాయంలోని భవానీ శంకర్ ఆలయంలో స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్ర హోమం నిర్వహించారు.

రుద్రేశ్వరునికి పూజలు చేస్తున్న గంగు ఉపేంద్రశర్మ

రేపు కేయూలో జాతీయ సదస్సు

హనుమకొండ చౌరస్తా, నవంబర్